TGTEL/26/A4015

# తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ మంగళవారం 01 సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 103 తెలుగువారి పత్రిక..... మీ కోసం




## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

మిగతా 2 లో



## తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు

మిగతా 2 లో



## భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం

మిగతా 2 లో



# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

- ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు

## 'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు



**హైదరాబాద్,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్? భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది.

మిగతా 2 లో

### జగ్గారెడ్డి కుమారుడి రిసెప్షన్‌కు

## కాంగ్రెస్ నేతల హాజరు

**హైదరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయిరెడ్డి, రమేష్ పటేల్ కుమార్తె పాలక్ పటేల్ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పిసిసి అద్యక్షుడు హన్మంత్ రావు, మంత్రి శ్రీధర్ బాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన వారు, దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి నూతన దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

04





### అమెరికా-కెనడా మధ్య

# వాణిజ్య యుద్ధం

మిగతా 2 లో

### కెనడా దారుణమైన దుర్వినియోగదారు

- కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు



**వాషింగ్టన్,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు.

### రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్


## రాజీనామా

### వ్యక్తిగత కారణాలతోనే అంటూ ప్రచారం

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

రాష్ట్రపతి 'ఎయిడ్-డి-క్యాంప్ మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అనూహ్య రాజీనామా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారికి సోషల్ మీడియాలో క్రేజ్ ఉంది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది.





మొదటిపేజీ తరువాయి

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం కెనడా దారుణమైన దుర్వినియోగదారు

ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

# జాతీయ జెండాకు అవమానంపై మూల్యం తప్పదు ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. న్యూయార్క్‌లో మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ వేదికగా జరిగిన సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం బయట జరిగిన ఈ ఘటన తాలూకు వీడియోను మంత్రి నెట్టింట షేర్ చేశారు. 'ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, స్టేడియం బయట ఖలిస్థానీలు నానా రభసా సృష్టించారు. ఓ వ్యక్తి తన కాలికి భారత జాతీయ జెండాను చుట్టుకుని అటూ ఇటూ ఊపుతూ అవమానించాడు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నెట్టింట పలువురు డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించాలని యూఎస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఎస్ఎస్ సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో ంఊఇంఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఈ సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందే వారు కర్మ భూమి పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శవంతంగా నిలవాలని అన్నారు.

# రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్ రాజీనామా వ్యక్తిగత కారణాలతోనే అంటూ ప్రచారం

మొదటిపేజీ తరువాయి

12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్ వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లుపేర్కొన్నారు. 32 ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ లో చేరారు. మిలిటరీస్టడీస్,'ిఫెన్స్‌మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత'బలిదాన్ బ్యాడ్జ్'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట్' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయనకెరీర్‌కీలక మలుపు తిరిగింది. రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం,ప్రొటోకాల్‌ను అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా)**

తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఃఖా పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

# కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

మొదటిపేజీ తరువాయి

**మార్కాపురం, ఆగస్టు 31(తెలంగాణ మంజీరా);**

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయం లోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు. 30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభంవెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

### వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి"

2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు. మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలువెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి -కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్క రాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పని చేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు. . ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా. .తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (఻ూక్షం఻ూ) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి. ÷-రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ÷-రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను త్రి-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి ఈ పర్యటన పెద్ద బలం ఇచ్చింది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మధ్యంతర లక్ష్యానికీ ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు కుదరడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. తెలంగాణ యువత, పిల్లలకే కాకుండా దేశంలోని విద్యార్థులకు కూడా ప్రపంచస్థాయి విద్య అందేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నేనే నాయకత్వం వహిస్తాను' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదివి యువత ప్రపంచస్థాయిలో మంచి నిపుణులుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని సాధించడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మెరికా పర్యటనలో తెలంగాణ బృందం నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ చర్చల అనంతరం పలు కీలక ఒప్పందాలు పూర్తయ్యాయి. భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా టెక్ తెలంగాణలో పరిశ్రమలకు అవసరమైన, భవిష్యత్తు ఉద్యోగాలకు ఉపయోగపడే విద్యా విధానాలను తీసుకురావడంపై సహకరించనుంది. ఻ుద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పిల్లలు, యువతకు విద్య, నైపుణ్యాలు, క్రీడలను తన ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటిగా పెట్టుకున్నారు. నర్సరీ నుంచి కేజీ, ప్రాథమిక, హైస్కూల్ వరకు విద్యా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నైపుణ్య శిక్షణ, క్రీడా విద్యను కూడా బలోపేతం చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో భారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇప్పటికే నాలెడ్జ్ ఎకానమీలో మంచి స్థానం సంపాదించిందన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో హైదరాబాద్ ముందుందని చెప్పారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీల నుంచి మంచి విద్య పొందిన మానవ వనరులే హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన బలమన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, కంపెనీలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కాలేజీల ద్వారా నైపుణ్యం కలిగిన బ్లూ కాలర్ ఉద్యోగులను తయారు చేస్తామని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో తయారీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల స్వల్పకాలిక కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను హైదరాబాద్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు ఇన్‌స్టిట్యూట్‌లోని తరగతి గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నవంబర్ నుంచే హైదరాబాద్‌లోని ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో భారత్ ఫ్యూచర్ సిటీలోనూ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌కు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఻సెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ విద్యాసంస్థలు, క్రీడా సదుపాయాలు రాష్ట్ర అభివృద్ధిపై చూపే ప్రభావంపై ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశ్రమల రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఇప్పుడు విద్య, పరిశోధన, నైపుణ్యాల రంగాల్లోనూ అదే స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో అడుగుపెడితే తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో కొత్త పెట్టుబడులు, కొత్త కంపెనీలు, కొత్త ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది. మూడు ట్రిలియన్ తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. విద్య, నైపుణ్యం, పరిశోధన, పరిశ్రమలను కలిపి ముందుకు తీసుకెళ్లే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రయత్నం తెలంగాణ భవిష్యత్తుకు కొత్త బాట వేస్తోంది.

# కలెక్టరేట్ ప్రజావాణికి 41 ఫిర్యాదులు.

## ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి..!

### అదనపు కలెక్టర్లు సంగీత, పాండు

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా (న్యూస్ ప్రతినిధి):**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయనీ, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్ 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు,



పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహస్యసర్ ఫేజ్--2పై బిఎల్ ఎలకు ప్రత్యేక శిక్షణ..!

**నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ఫేజ్--2 ప్రక్రియపై బిఎల్ ఎలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ భవన్ నుంచి విచ్చేసిన మాస్టర్ ట్రైనర్, సర్ కోఆర్డినేటర్ శ్రీ మాణిక్యం మల్లేష్ యాదవ్ బిఎల్ ఎలకు సర్ ఫేజ్--2లో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. తమ తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో నమోదు చేయించడం, అవసరమైన సవరణలు చేయించడం, ఓటర్ల వివరాలను పరిశీలించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సంజీవరెడ్డి పాల్గొని సర్ ఫేజ్--2 ప్రక్రియపై బిఎల్ ఎలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను బాధ్యతగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ ఎలు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. సర్ ఫేజ్--2 ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్ధవంతంగా పూర్తి చేయడానికి ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బిఎల్ ఎలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశా వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

కంగ్టి మండల పరిధిలోని ఎడ్ల రేగడి తండాకు చెందిన జమున బాయి భర్త కమల్ సింగ్, పవర్ అనిత బాయి భర్త సురేష్లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని, లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. అనంతరం గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎడ్ల రేగడి తండాలో గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు ఒక గొప్ప కల అని, ఆ కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావు సింగ్, బలరామ్, శివాజీ పాటిల్ సర్పంచ్, పండరి రెడ్డి, దత్తు గౌడ్ మాజీ ఎంపీటీసీలు,రాములు, జగదీష్, సర్దార్,కుమార్ సింగ్నారాయణ,సురేష్,పురం, ధనరాజ్, రంజీ, బాల్ సింగ్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు





# కాంగ్రెస్ వెయ్యి రోజుల విధ్వంస పాలనపై బిఆర్ఎస్ పోరుబాట.

## సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ఏడు రోజులు నిరసన కార్యక్రమాలు.

### పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దిశానిర్దేశం

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు సిద్ధమైంది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన, 420 మోసాల పేరుతో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపట్టనున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాలపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడు రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల నిర్వహణపై నాయకుల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఏడు రోజుల కార్యక్రమాల కార్యాచరణను నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విధ్వంసక పాలనపై ప్రజల తరపున పోరాడే సమయం ఆసన్నమైంది. అరచేతిలో వైకుంఠం చూపించినట్లు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఏడు రోజుల కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, బాకీ కార్డులు రూపంలో కాంగ్రెస్ హామీలను ప్రతి గడపగడపకు చేరవేయాలని పిలుపునిచ్చారు. రానున్నది మన ప్రభుత్వమే. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, కేసీఆర్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో ఉన్న లోటుపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోవాలని చింతా ప్రభాకర్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, సీనియర్ నాయకులు హకీమ్, డాక్టర్ శ్రీహరి, మాజీ జడ్పీటీసీలు మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్డిఓ రామకృష్ణకు అంతర్జాతీయ గుర్తింపు..!

**నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ గణిత పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు స్ప్రింగర్ నేచర్ జర్నల్లో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ప్రభుత్వ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే గణిత రంగంలో పరిశోధనలు కొనసాగిస్తున్న నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆయన రూపొందించిన గణిత పరిశోధన పద్ధతి అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంతో పాటు జూలై 23న స్పెండర్ నేచర్లో ప్రచురితమైనట్టు సమాచారం గణితంలో క్లిష్టంగా భావించే పలు సమస్యలను సులభతరం చేసే విధంగా ఆర్డీవో రామకృష్ణ రూపొందించిన ఈ కొత్త పద్ధతి ప్రాధాన్యత సంతరించుకుంది ముఖ్యంగా బౌండరీ వ్యాల్యూ ప్రాబ్లం పరిష్కారానికి ఈ విధానం ఉపయోగపడుతుందని ఆయన పరిశోధనలో పేర్కొన్నారు గణితంలో వివిధ రంగాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో బౌండరీ వాల్యూ సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది ఒక వ్యవస్థకు ప్రారంభం లేదా ముగింపు పరిస్థితులు నిర్దిష్ట పరిమితులు ఉన్నప్పుడు వాటి ఆధారంగా పరిష్కారాన్ని కనుగొనడం ఈ విధానంలో కీలకం ఇలాంటి సమస్యలను మరింత సులభంగా సమర్థవంతంగా పరిశీలించేందుకు ఆర్డిఓ రామకృష్ణ రూపొందించిన గణిత పద్ధతి ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ పరిశోధన అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపురావడం విశేషంగా నిలిచింది భవిష్యత్తులో వంతెనలు వివిధ నిర్మాణాలు బీన్స్ వంగే విధానాన్ని లెక్కించడంలో ఉపయోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. నిర్మాణాల డిజైన్ వాటిపై పడే భారం వంగి పరిస్థితులను అంచనా వేయడంలో గణితపరమైన లెక్కలు ఎంతో కీలకము అదేవిధంగా వైద్యరంగంలోనూ ఈ పద్ధతి ఉపయోగ అవకాశాలు చెబుతున్నారు ముఖ్యంగా ఎమ్మారై ఈసీజీ వంటి వైద్య పరీక్షలు వాల్యూ సంబంధిత సమస్యలను మరింత సులభంగా పరిష్కరించేందుకు ఈ పరిశోధన దోహదపడే అవకాశం ఉందని తెలిపారు.



# ఇంద్రకరణ్ గ్రామ శివారులో అక్రమ డీజిల్ దందా

### గ్రామస్తుల ప్రశ్నలతో పరారైన స్మగ్లర్లు..

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :**

కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ శివారులో అక్రమంగా డీజిల్ నిల్వ చేసి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టైంది. స్థానికుల కథనం ప్రకారం, గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ట్యాంకర్లు / డ్రమ్ములలో డీజిల్ నిల్వ చేసి, తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అనుమానం వచ్చిన గ్రామస్తులు అక్కడికి వెళ్లి ప్రశ్నించడంతో, అక్రమార్కులు వాహనాలను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. సంగారెడ్డి జిల్లా కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఇలాంటి అక్రమ డీజిల్ దందా గతంలో కూడా వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలో డీజిల్ పై వ్యాట్ తక్కువగా ఉండటంతో లీటరుకు దాదాపు రూ.10 తేడా ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు ట్యాంకర్లలో బల్క్ గా తెచ్చి ఇక్కడ పరిశ్రమలకు, లారీలకు బ్లాక్ లో అమ్ముతున్నారని గతంలో అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై ఇంకా అధికారికంగా కేసు నమోదు కాలేదు. ఘటనా స్థలం ఫోటోలు / వీడియోలు ఉంటే 100 డయల్ కు లేదా స్థానిక కంది పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరుతున్నారు.



# పట్టణ బిజెపి కన్వీనర్ గా ప్రేమ్ కుమార్ యాదవ్

**నర్సాపూర్ తెలంగాణ మంజీరా న్యూస్ :**

నర్సాపూర్ పట్టణ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ గా గొల్ల ప్రేమ్ కుమార్ యాదవ్ ను జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీపై నమ్మకంతో క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రేమ్ కుమార్ యాదవ్ సేవలను గుర్తించి నరసాపూర్ పట్టణ కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన బాధ్యతలను స్వీకరించిన ప్రేమ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నర్సాపూర్ పట్టణంలో బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అన్ని వర్గాల వారిని చిన్నా పెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల వారిని ఏకతాటి పైకి తీసుకొని వచ్చి పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యంగా పేర్కొంటూ తనపై నమ్మకం ఉంచిన జిల్లా పెద్దలకు పట్టణ పెద్దలకు కార్యకర్తలకు అభినందన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, సంఘసాని సురేష్, రమేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం.

**నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని తొగిట గ్రామానికి చెందిన బ్యాతోల్ సామెల్ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న డాక్టర్ మోహన్ నాయక్ మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శశికాంత్, ఉప సర్పంచ్ రామ్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పద్మారావు, వార్డు సభ్యుడు ఏసు, సాయిబాబా, మాణిక్యం, బ్యాతోల్ పద్మారావు, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## వదువరులను ఆశీర్వాదించిన కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

శివ్వంపేట్ మండలంలోని జీవన్ దివ్య గార్డెన్‌లో మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంతం గారి కుమారుడి రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించిన వారు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి నూతన దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సుధీర్ కుమార్ గౌడ్, ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వెల్దుర్తి--మెదక్ రహదారి కోసం మహా పాదయాత్ర

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటం చేస్తాం..! మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి**

**నర్సాపూర్/ మెదక్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

వెల్దుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మెదక్ వరకు వెల్దుర్తి--మెదక్ రహదారి సమస్య పరిష్కారం కోసం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.వివిధ మండలాలు, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాదయాత్రకు తమ మద్దతు తెలిపారు. రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తి నుంచి మెదక్ వరకు రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాదయాత్ర సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ఆటో డ్రైవర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మహా పాదయాత్రకు వివిధ గ్రామాల నుండి ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



### సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల

## ప్రిన్సిపాల్ సస్పెన్షన్.

**కళాశాల నిర్వహణలో లోపాలు.**

**విద్యార్థినుల పట్ల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**మునిపల్లి, తెలంగాణ మంజీరా న్యూస్ :**

మండల పరిధిలోని బుదేరా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మునిపల్లి మండలం బుదేరాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా వ్యవహారాల్లో నిర్లక్ష్యం, నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అలాగే విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరుపై పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా కోఆర్డినేటర్ కల్పన బుదేరా కళాశాలను సందర్శించి కళాశాల నిర్వహణ, పరిపాలనా అంశాలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు.సమర్పించిన నివేదికలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం, ప్రిన్సిపాల్ పి. శైలజ నిర్లక్ష్య ధోరణి, కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల తగిన విధంగా వ్యవహరించకపోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్యలు చేపట్టి, ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రెసిడెన్షియల్ కళాశాలల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



## భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

**కోల్‌కతా,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు.

## కర్నాటకలో రైలు ఢీకొని ముగ్గురు మృతి

**హిందూపురం వాసులుగా గుర్తింపు**

**బెంగళూరు,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబల్లాపుర రైల్వే స్టేషన్‌లో ట్రాక్ దాటుతున్న ఓ మహిళ సహా ఇద్దరు బాలికలను రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న యలహంక రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులు ఏపీ రాష్ట్రం హిందూపురానికి చెందిన ఇర్ఫాన (46), రుకియా (13), రాకియా(8)గా గుర్తించారు. ఆదివారం సెలవు కావడంతో దొడ్డబళ్లపురలోని బంధువుల ఇంటికి వీరు వచ్చారు. సోమవారం ఇంటికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఎపి మద్యం కేసులో సిట్ తీరు-అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే సీరియస్‌గా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడిగారని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశమే లేదని పేర్కొంది. కస్టోడియల్ ఇంటరాగేషన్ కోరితే.. జడ్జి మీకు ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చారు కదా అని కోర్టు అడిగింది. పోలీసు కస్టడీకి ప్రిపేర్ కాలేదు.. జ్యుడిషియల్ కస్టడీ ఇవ్వమంటున్నారు.. ఇదేం ప్రవర్తన అని ప్రశ్నించింది. ప్రొడక్షన్ వారెంట్.. అరెస్ట్ వారెంట్‌తో సమానం పేర్కొంది.మరోవైపు ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం వాయిదా వేసింది.

## శ్రీధర్ బాబుతో జర్మన్ ప్రతినిధి బృందం భేటీ

**సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం**

**హైదరాబాద్,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో జర్మన్‌కు చెందిన జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. సెమీ కండక్టర్ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని జీఐబీఏ ప్రతినిధులను మంత్రి కోరారు. తెలంగాణను సెమీ కండక్టర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. 'తెలంగాణ?జర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జర్మనీ, యూరప్ మార్కెట్లకు తెలంగాణ ఎగుమతులు సులభంగా చేరేలా ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి చెప్పారు. జర్మనీ టెక్నాలజీని తెలంగాణ టాలెంట్‌తో అనుసంధానిస్తామని వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్?2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్?2026 నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.



## దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సంజయ్ జాజు సమావేశం

**రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులు**

**2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు డీపీఆర్‌లు- రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎస్ సమీక్ష**

**హైదరాబాద్,ఆగస్ట్31(తెలంగాణ మంజీరా):**

రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్ తదితర ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ, వివిధ శాఖల నుంచి అవసరమైన పరిపాలనా అనుమతులు, రైల్వే ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. రైల్వే కనెక్టివిటీ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించి, రైల్వే ప్రాజెక్టుల పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు



రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌లను రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు.ల్గ÷ల్వే అండర్‌పాస్‌లు, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, వివిధ రైల్వే మార్గాల డబ్లింగ్ పనులు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా సదుపాయాల మెరుగుదల తదితర సుమారు 21 అంశాలపై సమావేశంలో సమీక్షించారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను గుర్తించాలని సీఎస్ ఆదేశించారు. ÷బిరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలని, ప్రధానంగా మున్సిపల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు-భవనాల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైల్వే ప్రాజెక్టుల అమలులో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని, అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని సీఎస్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎం గతిశక్తి పథకం కింద నిధులు పొందేందుకు అవసరమైన సమగ్ర డీపీఆర్‌లను సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. అలాగే ఎంఎంటీఎస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగర పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో టెర్మినల్స్ ఏర్పాటు, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీతో పాటు బు÷-లలెట్ ట్రైన్ మార్గాలకు అవసరమైన భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర డీపీఆర్‌లను సిద్ధం చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన రైల్వే మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, మేడ్చల్-మల్కాజిగిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సిటీ పోలీస్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, నిర్మల్, జనగామ, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## జగ్గారెడ్డి కుమారుడి రిసెప్షన్‌కు కాంగ్రెస్ నేతల హాజరు







